## క్లుప్తంగా

### నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజల నంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

### ఆర్వోప్లాంటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

నగరి : పట్టణ పరిధిలోని నేత్రదేవత దేశమ్మ ఆలయంలో మంత్రి ఆర్‌కే రోజా చొరవతో జీర్ణోద్ధరణ గావించి పునరుద్ధరణ చేస్తున్న సంగతి విదితమే. ఇప్పటికే ఆలయ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా మంత్రి రోజా సహకారంతో తుడా నిధులు రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆర్వో ప్లాంటుకు ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు భూమిపూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం మంచి నీటిని ఏర్పాటుచేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ సీకే దయానిధి, నాయకులు ధనపాల్ రెడ్డి, వెంకటేశులు, శశికుమార్, ధర్మకర్తలు అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

### కంటి వైద్య శిబిరానికి స్పందన



చికిత్స పొందుతున్న వృద్ధులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో అరవింద్ ఐ కేర్ వారు ఆదివారం ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటివైద్య నిపుణులు విష్ణుప్రియ, పురుషోత్తం శిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందించారు. 120 మంది శిబిరంలో పాల్గొని కంప్యూటర్ ఆధారిత కంటి పరీక్షలు చేసుకున్నారు. సర్పంచ్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు పర్యవేక్షించారు.

### వ్రతదీక్ష చేసిన భక్తులకు వస్త్రదానం



భక్తులకు వస్త్రదానం చేస్తున్న దాత

నగరి : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో శనివారం రాత్రి హరికథ, పాటకచేరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాగారం చేస్తూ వ్రతదీక్ష చేసిన వారికి ఆదివారం ద్వాదశి రోజున స్థానిక వైద్యులు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రన్ వస్త్రదానం చేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మణి ఆచారి, మోహన్ బాబు, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



భక్తులకు అన్నం వడ్డిస్తున్న దాతలు

కార్వేటినగరం: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ కుటుంబ సభ్యులు ఆదివారం 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకు వచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారం రోజుల్లోనే కాకుండా రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# ప్రజలు మెచ్చే పాలన అందిస్తున్నాం

- ప్రస్తుత ప్రభుత్వంలోనే ప్రజలకు మౌలిక సదుపాయాలు
- మంత్రి ఆర్‌కే రోజా
- రూ.కోటి మేర అభివృద్ధి పనులకు భూమిపూజ



నగరి 27వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : ప్రజలు మెచ్చే పాలన అందిస్తున్నామని, సీఎం జగనన్న పాలనలో ప్రజలకు మౌలిక సదుపాయాలు అన్నీ సమకూరుస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం నగరి మున్సిపల్ పరిధిలోని 6, 16, 26, 27 వార్డుల్లో రూ.కోటి నిధులతో నిర్మించే సిమెంటు



నగరి దళితవాడలో సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రత్యక్షంగా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇదే నిజమైన అభివృద్ధి అన్నారు. గత పాలనలో టీడీపీ నాయకులు వారి లబ్ధి కోసం, కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి పనులు చేపట్టారని ఆరోపించారు. దీంతో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ప్రాంతంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. మంచిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. మీ ఆశీస్సులతో 2024లో హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు ఇంద్రయ్య, బీడీ భాస్కర్, దయానిధి, అమర్, సాయిసంధ్యారాణి, గంగాధరం, మురుగ, బిలాల్, మోహన్‌రాజ్, నాయకులు ఆనంద్‌కుమార్, శశికుమార్, ఇలంగో, రాజముత్తు, శశికళ, తేన్‌మొళి తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మన రెడ్డి జనసంఘం సభ్యులు

గంగాధర నెల్లూరు: మన రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆవిష్కరించారు. ఆదివారం ఆయన మహదేవ మంగళం గ్రామానికి సమీపంలో ఉన్న సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో మన రెడ్డి జన సంఘం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు బలరాం రెడ్డి(బాబు రెడ్డి) మాట్లాడుతూ మన రెడ్డి జనసంఘం ద్వారా స్థానికంగా, బెంగళూరులో స్థిరపడిన సంఘ సభ్యులచే జీడీనెల్లూరు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే తమ సంఘం ఆర్థిక సౌజన్యంతో కమ్యూనిటీ హాలుతో పాటు పాఠశాల నిర్మాణానికి మండల పరిధిలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం వెంటనే రెవెన్యూ అధికారులకు స్థలం కేటాయించాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. తమ సంఘం తరఫున డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి, సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డిప్యూటీ సీఎం చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, రాష్ట్ర గీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, చిన్నమ రెడ్డి, కామసాని విజయకుమార్ రెడ్డి, మునిరాజారెడ్డి, గోవిందరెడ్డి, జయరామి రెడ్డి, వెంకటేష్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడుదాం.. ఆంధ్రకు సర్వం సిద్ధం

పాలసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్ర టోర్నమెంట్‌కు క్రీడామైదానం సిద్ధం చేయాలని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన ఆముదాల, బాలకృష్ణాపురం, శ్రీకావేరిరాజుపురం జరుగునున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడామైదానాన్ని పరిశీలించారు. శ్రీకావేరిరాజుపురంలో గతంలో కురిసిన వర్షానికి నీరు నిలవగా, ప్రదేశాల్లో నీటిని తొలగించి మట్టి తోలి జేసీబీతో చదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడాపోటీలు గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులకు ఓ వరమని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రేపటి నుంచి ఆడుదాం.. ఆంధ్ర పోటీలు

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్ర పోటీలు 26వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల్లో 26వ తేదీ నుంచి ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు క్రీడాపోటీలను ప్రారంభిస్తారన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆడుదాం.. ఆంధ్ర పోటీల్లో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో మొదలైన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభావంతులను వెలికి తీయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు పోటీల్లో పాల్గొంటారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యక్రమాన్ని విజయవంతం చేతయాలని పిలుపునిచ్చారు.

### చీరల పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చొక్కా నాగరాజు కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోవిందయ్య, మాజీ సర్పంచ్ వరదరాజులు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

### పలువురికి పరామర్శ



నరసింహారెడ్డి ఆరోగ్యం గురించి వాకబు చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



స్వర్ణలత మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం

పెనుమూరు(కార్వేటినగరం) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి నరసింహారెడ్డి కాలికి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి శాతంబాకం గ్రామానికి వెళ్లి నరసింహారెడ్డిని పరామర్శించారు. అదేవిధంగా ఉగ్రాణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల యువత కార్యదర్శి గౌరీశంకర్‌రెడ్డి తల్లి స్వర్ణలత(67)అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట మండల కన్వీనర్ విజయకుమారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, సర్పంచ్‌లు మురళీకుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యతీశ్వర్‌నాయుడు, రమేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా వైకుంఠ ద్వాదశి



దర్శనానంతరం ఆలయ మర్యాదలను అందుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

నారాయణవనం: పద్మావతీ సమేత కళ్యాణ వెంకన్న ఆలయంలో ఆదివారం వైకుంఠ ద్వాదశిని ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వార ప్రవేశం కోసం భక్తులు పోటెత్తారు. సుమారు 40 వేల మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మంత్రి ఆర్కే రోజా, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉత్తర ద్వారం నుంచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, డిప్యూటీ ఈఈ రాఘవయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఏఈ గురుప్రకాష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



అన్నప్రసాదాలు అందుకుంటున్న భక్తులు

# ధార్మిక సామాజిక చైతన్యం కల్పించడమే లక్ష్యం

కార్వేటినగరం: ప్రజల్లో ధార్మిక సామాజిక చైతన్యం కల్పించేందుకు సమరసత ఫౌండేషన్ కృషి చేస్తుందని శ్రీరాజరాజేశ్వరీ ఆశ్రమం విశ్వశాంతి ఫౌండేషన్ నిర్వాహకులు బాలుస్వామి అన్నారు. ఆదివారం స్థానిక స్కంధపుష్కరిణి సమీపంలో సమరసత ఫౌండేషన్ ధర్మప్రచారక్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలుస్వామి మాట్లాడారు. తమ ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో ఉన్న ఆలయాలను కేంద్రంగా మార్చుకుని హిందూ ధర్మప్రచారం చేస్తూ, ప్రజల్లో ధార్మిక, సామాజిక చైత్యనం కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం సమరసత ఫౌండేషన్ ధర్మప్రచారక్ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ధార్మిక సమావేశాలు నిర్వహించి హిందూ మతాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో భాగంగా



మాట్లాడుతున్న బాలుస్వామి

పెద్దఎత్తున భజన బృందాల ప్రదర్శనలు నిర్వహించారు. అదేవిధంగా మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. అలాగే గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ధర్మప్రచారక్ కన్వీనర్ చిన్నస్వామిరెడ్డి, తిరుపతి విభాగ కన్వీనర్ కుమారస్వామి, యువరాజు, తిరుపతి జిల్లా ధర్మప్రచారక్ నారాయణస్వామి పలువురు పాల్గొన్నారు.

# విద్యుత్ కాంతుల్లో చర్చిలు








నగరి : అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. ఆదివారం దీపపు కాంతులతో చర్చిలు కళకళలాడాయి. ప్రత్యేక ఆరాధన కోసం చర్చి ఆవరణలను రంగురంగుల బెలూన్‌లతో, కాగితాలు, దీపపు నక్షత్రాలతో అలంకరించారు. పలు దుకాణాల్లో క్రిస్మస్ ట్రీలు, స్టార్లు, బెలూన్స్, జీసస్ చిత్రపటాలు, బొమ్మలు, క్యాండిల్స్, శాంతాక్లాస్ మాస్కులు, దుస్తులు, బాలయేసు పశువుల పాకలు, క్రిస్మస్ కేక్‌లు, అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. చర్చిల్లో యేసు జీవితచరిత్రను చూపేవిధంగా బొమ్మలతో చేసిన ప్రత్యేక అలంకరణలు పలువురిని అలరిస్తున్నాయి. సంబరాలు ఊపందుకోవడంతో దుకాణదారులు వివిధ రకాల నూతన అలంకరణ సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో నివాసాలను అలంకరించుకోవడంలో క్రైస్తవులు నిమగ్నమయ్యారు. క్రిస్మస్ ప్రత్యేకతను చాటే వివిధరకాల కేక్‌లను కొందరు కొనుగోలు చేశారు. పండుగ రోజున పేదలకు దానం చేయడానికి కొత్తదుస్తులు కొనుగోలుకు వచ్చిన వారితో వస్త్ర దుకాణాలు కళకళలాడాయి.

**పాలసముద్రంలో..**


పాలసముద్రం : మండలవ్యాప్తంగా గ్రామాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. చర్చిల వద్ద స్టార్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు చర్చిలో సర్వం సిద్ధం చేశారు. సాయంత్రం క్రైస్తవులు గ్రామాల్లో డ్రమ్స్‌వాయిస్తూ ప్రార్థనలు చేపట్టారు. ఏసుప్రభు పశువుల పాకను ఏర్పాటు చేసి అందులో ఏసు బొమ్మలను కొలువుదీర్చారు.

**ప్రత్యేక అలంకరణలో సీఎస్‌ఐ చర్చి**

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. జీడీ నెల్లూరు దళితవాడలో 1929లో నిర్మించిన ఈ చర్చి చాలా ప్రాశస్త్యం కలిగింది. ఆదివారం పాస్టర్ సురేష్, ఉపదేశకులు సుందర రాజ్, సభమణియం రాజేష్ ఆధ్వర్యంలో చర్చిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి.



నగరి: ప్రత్యేక అలంకరణలో సెయింట్‌మేరీ చర్చి



విద్యుత్ దీపాలంకరణలో పన్నూరు సీఎస్‌ఐ చర్చి

# వైభవంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణ స్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన పవన్ కుమార్ దంపతులు, ముసలయ్యగారిపల్లెకి చెందిన రామ్మూర్తి రెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశు రెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవిందస్వామి, ద్వివేది, భక్తులు పాల్గొన్నారు.



శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనారాయణుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

### హితులంతా కలిసిన వేళ...

పుత్తూరు: ఆనాటి ఆస్నేహం.. ఆనంద గీతం అంటూ ముప్పైఆరేళ్ల తరువాత నాడు వారు చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 ఏడాదిలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం మళ్లీ పుత్తూరులో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్థానిక శ్రీనివాసా బీఈడీ కళాశాలలో కలిసి తమ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వారి స్థితిగతులను పంచుకున్నారు. కార్యక్రమాన్ని కేఎల్ మురళీకృష్ణ, బాలాజీరావు, మధు, చంద్రమౌళి, లక్ష్మీ, రేవతి, ఆర్కే మోహన్ మోహన్ పర్యవేక్షించారు.





### సుఖ సంతోషాలను నింపాలి

– మంత్రి ఆర్కే రోజా



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : క్రిస్మస్ పండుగ ప్రజల్లో సుఖసంతోషాలను నింపాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో కౌన్సిలర్ అణ్ణెమ్మ యాకోబ్ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. పేద మహిళలు 200 మందికి చీరలను పంపిణీ చేశారు. పలువురికి క్రిస్మస్ విందును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిస్మస్ వస్తుందంటే క్రైస్తవుల ఇంట నెల రోజుల ముందు నుంచే పండుగ వాతావరణ నెలకొంటుందన్నారు. లోకశాంతి కోసం ప్రాణత్యాగం చేసి మానవ సౌభ్రాతృత్వం కోసం ఆదర్శంగా నిలిచిన క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ప్రతి ఇంట ఆనంద పుకాంతులు వెదజల్లాలన్నారు. క్రిస్టియన్లకు ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు యోవాన్, సలీం, దామునాయుడు, రాజముత్తు తదితరులు పాల్గొన్నారు.